

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, జూలై 15: ప్రజావాణి, ప్రజాదర్బార్ ఫిర్యాదులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి 307 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, రమేశ్‌బాబు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశి రేపు మొహర్రం



- చాతుర్మాస్య దీక్షలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, జూలై 15: ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం జరుపుకోనున్నారు. తొలి ఏకాదశి నుంచే పండుగలు ప్రారంభమౌతాయి. చాతుర్మాస్య దీక్షలను గృహస్థులు, స్వామీజీలు ఏకాదశి నుంచి ప్రారంభిస్తారు. ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా దక్షిణాయనం ప్రారంభమవుతుంది.

- పీరీల ఊరేగింపునకు ఏర్పాట్లు

కరీంనగర్ కల్చరల్, జూలై 15: జిల్లా వ్యాప్తంగా మొహర్రంను బుధవారం జరుపుకోనున్నారు. పీరీలకు ప్రత్యేక పూజలు జరిపి జామా మసీదు పక్కన నిలుపుతారు. ముస్లింలు, హిందువులు పిల్లా పాపలతో హాజరై బత్తీసలు, కుడుకలు, మర్మరాల దండలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రి పొద్దుపోయే వరకు పీరీల దర్శనం కొనసాగనుంది. కొన్ని రోజుల క్రితం వివిధ ప్రాంతంలో పీరీలను నిలుపగా పలువురు దట్టీలు కట్టుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలు డివిజన్లలో, గ్రామాల్లో పీరీలను ఊరేగించారు.



కుల గణనపై కార్యాచరణ ప్రకటిస్తాం

- ఇప్పటికే జీవో జారీ చేశాం
- బీజేపీ కూల్చిన ప్రభుత్వాల్లో ఎంత మంది రాజీనామా చేశారు
- ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కులగణనపై కార్యాచరణ ప్రకటిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం నగరంలోని శాతవాహన యూనివర్సిటీలో వనమహోత్సవ కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుల గణనపై ఇప్పటికే జీవో జారీ చేశామని, బిహార్‌లో ఎలా చేశారనే విషయంపూ స్టడీ చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ వల్ల జాప్యం జరిగిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు కుల గణనపై, రాహుల్‌గాంధీ చెప్పినట్లు బలహీన వర్గాలతోపాటు ఇతర వర్గాలకు న్యాయం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రెండు మూడు రోజుల్లో కులగణనపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల తీర్పుతో అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్, బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వం మనుగడ సాగించదని, కూలిపోతుందని ప్రకటించడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రభుత్వాలను కూల్చడమే రాజనీతా అని ప్రశ్నించారు. వారు కూల్చిన ప్రభుత్వాల్లోని ఎంత మంది శాసన సభ్యులతో రాజీనామాలు చేయించారన్నారు. ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర వారిదే అన్నారు. తాము కౌంట్ డౌన్ స్టార్ట్‌చేస్తే వారి కుటుంబ సభ్యులు తప్ప ఎవరూ మిగిలే వారు కాదన్నారు. అధికారం చేపట్టిన వెంటనే కూల్చుతామని ఆ రెండు పార్టీలు ప్రకటనలు చేశాయ న్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజామద్దతుతో గెలిచిన ప్రభుత్వాన్ని కూల్చుతామనడంఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వారు కూల్చుతామంటే మేము నిలబెడతామని శాసన సభ్యులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్‌పార్టీ పూర్తి వ్యతిరేకమన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కాపాడుకునే బాధ్యత తమపై ఉందన్నారు. ఇక్కడి పార్లమెంట్ సభ్యుడు సైతం ప్రభుత్వం కూలుతుందని అనలేదా అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు మాట్లాడే హక్కు లేదని, బీఆర్ఎస్‌లో చేరిన శాసన సభ్యుడిని రాజీనామా చేయించకుండా మంత్రిని చేయలేదా అని ప్రశ్నించారు. ఆస్తులు కాపాడుకోవడనికి పార్టీలు మారుతున్నారన్నడం హాస్యాస్పదమన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని, రాజ్యాంగహత్యా దివస్ నిర్వహిస్తామనడం ఎంత వరకు సమంజసమన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.

- మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భగత్‌నగర్/ గణేష్‌నగర్: మొక్కలునాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో వనమ హోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆరు మొక్కలు అందిస్తారని, వాటిని నాటి సంరక్షించాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పూలు, పండ్ల మొక్కలు అందిస్తారన్నారు. ప్రజల సహకారంతోనే మొక్కల సంరక్షణ సాధ్యమ వుతుందన్నారు. తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో యూనివర్సిటీకి శంకు స్థాపన చేశామని, అప్పుడు తాను మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా ఉన్నానన్నారు. 200 ఎకరాలను యూనివర్సిటీకి కేటాయించామని తెలిపారు. జిల్లాలో 43 లక్షల మొక్కల పెంచాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. ప్రతి మొక్కకు అధికారులు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఎఫ్‌వో బాలమణి, డీఆర్డీవో శ్రీధర్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో ప్రభు పాల్గొన్నారు.



ఆగస్టు 15 నాటికి రుణమాఫీ

- రూ. రెండు లక్షల వరకు మాఫీ చేయనున్న ప్రభుత్వం
- స్వల్ప కాలిక పంట రుణాలకే వర్తించనున్న పథకం
- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పంట రుణ మాఫీని ఆగస్టు15 నాటికి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల వరకు పంట రుణమాఫీ వర్తిస్తుంది. 2018 డిసెంబరు 12 తేదీ న లేదా ఆ తర్వాత మంజూరైన, రెన్యూవల్ అయిన రుణాలకు, 2023 డిసెం బర్ 9నాటికి రైతులు బకాయి ఉన్న అసలు, వడ్డీ మాఫీకి అర్హత ఉంటుంది.



కీలక అంశాలు

- డిసెంబరు 12, 2023 నాటికి రైతుకు ఉన్న రుణం, లేక రెండు లక్షల వరకు ఏది తక్కువైతే దాన్ని పొందేందుకు రైతులు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది.
- రెండు లక్షలకు మించిన రుణం ఉంటే రైతులు ఆపైన ఉన్న రుణాన్ని మొదట చెల్లించాలి. ఆ తర్వాత రెండు లక్షల రుణ మొత్తాన్ని మాఫీ కోసం ఖాతాకు బదిలీ చేస్తారు.
- రెండు లక్షల కంటే ఎక్కువ ఉంటే కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేస్తారు. అనంతరం దామాషా పద్ధతిలో కుటుంబంలో ఉన్న పురుషుల పేరుపై ఉన్న రుణాలను మాఫీ చేస్తారు.
- ఎస్‌హెచ్‌జీలు, జేఎల్‌జీలు, ఆర్ఎంజీలు, ఎల్ఈసీఎస్‌లు తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించదు. రీషెడ్యూల్ చేసిన రుణాలకు వర్తించదు. కంపెనీలు, ఫర్మ్‌ల పేరిట తీసుకున్న పంట రుణాలకుమాఫీ పథకం వర్తించదు.
- పీఏసీఎస్‌ల ద్వారా తీసుకున్న పంట రుణాలకు మాఫీ వర్తిస్తుంది.

- ఆహార భద్రతా కార్డు డేటాబేస్ ప్రామాణికంగా..

రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి ఆహారభద్రతా కార్డు డేటా బేస్ ప్రామాణికంగా ఉంటుందని ప్రభుత్వం మార్గదర్శకాలలో పేర్కొంది. రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులను రుణమాఫీ పథకాన్ని అమలు చేసే అధికారిగా నియమిం చారు. ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒకరిని నోడల్ అధికారిగా నియమించాలని, ఆ అధికారి వ్యవసాయశాఖ సంచాలకుడు, నేషనల్ ఇన్ ఫర్మేటిక్ సెంటర్‌కు సమన్వయకర్తగా వ్యవహరిస్తారని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

- రైతుల కోసం పరిష్కార విభాగం

రుణమాఫీపై రైతుల సందేహాలను తీర్చడానికి, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయశాఖ సంచాలకులు ఒక పరిష్కార విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. రైతులు తమ ఇబ్బందులను ఐటీ పోర్టల్ ద్వారాగానీ, మండల స్థాయిలో స్థాపించిన సహాయ కేంద్రాల వద్ద అధికారులకు తెలపాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు రైతుల అభ్యర్థనలను 30 రోజుల్లోపు పరిష్కరించి దరఖాస్తుదారుడికి పంపాల్సి ఉంటుంది. రుణమాఫీ పథకం అమలుకు మార్గదర్శకాలు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

- కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, జూలై 15: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో గరిష్ఠ పరిమితిలేని నాణ్యమైన ఉచిత వైద్య చికిత్సలు అందించాలని, కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం ఐఆర్‌ను 20 శా తానికి పెంచాలని, పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని, ఈ నెల 1 నుంచి మానిటరీ బెనిఫిట్ చెల్లిస్తూ అమలు చేయాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు లు, ఇతర బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

- వారంరోజుల్లో అనుమతి లేని ఆరు నిర్మాణాల కూల్చివేత

కరీంనగర్ టౌన్, జూలై 15: నగరంలోని అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాలపై నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు వారం రోజుల్లో ఆరు అక్రమ కట్టడాలు, అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేశారు. సోమవారం గౌతమ్‌రావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో మంకమ్మతోటలో నగరపాలక సంస్థ



మంకమ్మతోటలో అనుమతి లేకుండా నిర్మించిన ఓ భవనాన్ని కూల్చివేస్తున్న కార్మికుడు

ఇచ్చిన అనుమతికి మించి నిర్మించిన సెకండ్ ఫ్లోర్, ఆపై నిర్మించిన పెంట్‌హౌస్‌ను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డిప్యూటీ సిటీ ప్లానర్ భానుచందర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్లను, భవనాలను, వాణిజ్య సముదాయాలను నిర్మించుకునేందుకు బల్దియా నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతిలేకుండా, అనుమతికి మించి, అక్రమ కట్టడాలను చేస్తే మున్సిపల్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాలతో వారం రోజుల్లో ఆరు కట్టడాలను కూల్చివేశామని, అక్రమ కట్టడాలు, అనుమతిలేని భవనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. మంకమ్మతోటలో ఒకరు జీ+1 భవన నిర్మాణానికి అనుమతి తీసుకొని, రెండంతస్తులతోపాటు పెంట్‌హౌస్‌ను నిర్మించుకున్నారన్నారు. దీనిపై స్థానికుడు గౌతమ్‌రావు నగరపాలక సంస్థలో ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టును ఆశ్రయించారని చెప్పారు. కోర్టు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి ఇచ్చిన ఆదేశాల మేరకు సంబంధిత ఇంటి యజమానికి నోటీసులను జారీ చేశామని తెలిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సూచనలతో టీపీవో శ్రీహరి, టీపీఎస్ రాజ్‌కుమార్, నవీన్‌తో కలిసి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు చెప్పారు. భవ నాలు, ఇళ్ల నిర్మాణాలకు నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నగర అభివృద్ధికి సహకరించాలని డీసీపీ కోరారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని, ఇలాంటి మరిన్ని కట్టడాలు మరిన్ని ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, నోటీసులు జారీ చేసి వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ స్వామికి హారతి ఇస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, జూలై 15: ఇస్కాన్ మందిరం కరీంనగర్, జగన్నాథ రథయాత్ర కమిటీ, ప్రజ్ఞాభారతి సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జగన్నాథ రథయాత్రను సోమవారం వైభవంగా నిర్వహించారు. వర్షం కురిసినా తడుస్తూ వందలాది మంది రథాన్ని లాగుతూ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు పూజలు చేశారు. పూరీ యాత్ర మాదిరి రథం ముందు శుభ్రం చేశారు. గీతా భక్త సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య ఆధ్వర్యంలో పుప్పల రామేశం, చిట్టుమల్ల దామోదర్, చిన్న వేంకటయ్య, సభ్యులు సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో మయూర గిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, యాత్ర చైర్మన్ కన్న కృష్ణ, కో చైర్మన్లు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోమాళ్ల రాజేందర్‌రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, ప్రజ్ఞాభారతి ప్రతినిధి డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, మండల నగేశ్‌రెడ్డి, నంది శ్రీనివాస్, గసికంటి జనార్దన్‌రెడ్డి, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, గర్రెపల్లి మహేశ్వరశర్మ పాల్గొన్నారు.




కోలాట నృత్యం చేస్తున్న విద్యార్థిని




జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తులు

నగరంలో 'అమ్మ మాట... అంగన్‌వాడీ బాట'

కరీంనగర్ టౌన్, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. సోమవారం పలు చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలోల చేర్పించాలని ర్యాలీలు నిర్వహించారు. 50వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన అమ్మమాట అంగన్వాడీ బాట ర్యాలీ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, కోతిరాంపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, వనజ పాల్గొన్నారు. 2, 22వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన కార్యక్రమంలో కార్పొరేటర్ గంట కల్యాణి శ్రీనివాస్, మహిళాశిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ రాజమణి, టీచర్లు పాల్గొన్నారు.















డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

కరీంనగర్ టౌన్, జూలై 15: డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టేందుకు అధికారులకు యువతకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డ్రగ్స్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి అధికారులతో నార్కో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణ కోసం అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందకు కాన్షియస్‌నెస్ క్లబ్బులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలీసులు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహించాల న్నారు. యువత లక్ష్య సాధన కోసం కఠోర శ్రమ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పవన్‌కుమార్, కరీంనగర్; హుజూరాబాద్ ఆర్డీవోలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, అడిషనల్ డిసిపి లక్ష్మినారాయణ, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం : ఎస్ఈ

గణేశ్‌నగర్, జూలై 15: విద్యుత్ ప్రజావాణిలో వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. సోమవారం విద్యుత్ సర్కిల్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రజావాణిలో 15 ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్నా సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాల ని సూచించారు. సర్కిల్ కార్యాలయానికి 8 దరఖాస్తులు రాగా అందులో మూడు దరఖాస్తులు తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. మూడు టౌన్ డివిజన్‌కు, నాలుగు రూరల్ డివిజన్‌కు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ, స్వప్న, ఏఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మందు బాబుల వీరంగం

● ఫర్నిచర్ ధ్వంసం

కోరుట్ల రూరల్, జూలై 15: మండలంలోని దర్మారం గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలో మందు బాబులు వీరంగం సృష్టిం చారు. ఫర్నిచర్ ధ్వంసం చేసిన సంఘటనపై గ్రామస్థులు మల్లాపూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో పరిశీలన జరిపి కేసు నమోదు చేశారు. పోలీసులు... గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం బాటిళ్లతో వెళ్లి పాఠశాల చివరి తరగతి గదిలో మద్యం సేవించి దానిలో ఉన్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తెచ్చుకు న్న మందు బాటిళ్లను పగులగొట్టి చిందరవందరగా పడేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు క్లాస్ రూంలో చిందర వందరగా పడిఉన్న ఫర్నిచర్‌ను చూసి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు పరిశీలన జరిపి విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జూలై 15: మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన కొత్తపల్లి నవీన్ (24) అనే యువకుడు చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపి న వివరాల ప్రకారం.. మృతుడు నవీన్ తల్లికి మతిస్థిమితం సరి గా లేకపోవడంతో రెండు నెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉండ డంతో ఆర్థిక పరిస్థితి దిగజారి ఇల్లు గడవడం కష్టంగా మా రింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించ డంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కొత్తపల్లి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం

మల్యాల, జూలై 15: మండలంలోని మ్యాడంపల్లిలో ఆదివా రం రాత్రి ఒకరిపై హత్యాయత్నం జరిగింది. గుర్రం మల్లయ్య అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన అంజి అనే వ్యక్తి కత్తితో దాడి చేయగా మల్లయ్యకు గాయాలు కావడంతో చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. హత్యాయత్నానికి ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న గొడవలే కారణమని తెలుస్తోంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

గణేశ్‌నగర్, జూలై15: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ ఎఫ్ఐ) జాతీయ కో-కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నంద గణేష్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కుమార్ తిరుపతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నంద గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూ నివర్శిటీల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. యూని వర్శిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

కల్తీ మద్యం, ఆహారంతో అనారోగ్యం

సుభాష్‌నగర్, జూలై 15: కల్తి మద్యం, కల్తి ఫుడ్ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొమ్మకల్ గ్రామంలో ఉన్న వైన్ షాపు నిర్వాహకులు పరిశుభ్రతను పాటించడంలేదని ఆరోపించారు. ఇది వర్షాకాలమని, డెంగ్యూ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వైన్‌షాపు నిర్వాహకులు, పర్మిట్ రూం నిర్వహణ సరిగా లేదని, పూర్తి స్థాయిలో శుభ్రపరచక పోవడంతో అందులో మద్యం సేవించడానికి వెళ్లేవారు వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోపించారు. వైన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిలిచిఉంటుందన్నారు. ఆ దారి గుండా వెళ్లే గ్రామ స్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు వెంటనే ఆ వైన్‌షాపును సందర్శించి కల్తి మద్యం అమ్మకాన్ని అడ్డుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని వినతి

కోరుట్ల రూరల్, జూలై 15: మండలంలోని నాగులపేట గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలింపును అరికట్టాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన యువకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన యువకులు గ్రామ శివారులోని సైఫన్ ప్రాంతంతో పాటు కథలాపూర్ మండలం తక్కల్లపల్లి శివారులోని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తూ గ్రామంలో ఎవరు అడిగినా వారిపై నైతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిం చారు. గ్రామానికి చెందిన వంతడుపుల స్వామి అనే వ్యక్తి ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ అత నిపై ఫిర్యాదు చేసిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణా జరుగుతున్న విష యంపై ఎన్నిమార్లు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించినా జరిమానాలను విధించి వదిలి పెట్టడంతో వారి ఆగడాలు ఆగడం లేదన్నారు. అక్రమ రవాణా అరికట్టి అక్ర మార్కులపై చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

గోదావరిఖని నుంచి అరుణాచల క్షేత్రానికి సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, జూలై 15: కరీంనగర్ రీజియన్ పరిధిలోని గోదావరిఖని నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచల క్షేత్రానికి ఈ నెల 21న గురు పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 శుక్రవారం రాత్రి 7గంటలకు గోదావరిఖనిలో బస్సు బయలుదేరి అదే రోజు రాత్రి 8గంటలకు కరీంనగర్ చేరు కుంటుందన్నారు. కరీంనగర్ నుంచి అరుణాచల క్షేత్రానికి వెళ్లే దారిలో భక్తులు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం, తమిళనాడులోని వేలూరు శ్రీ మహాలక్ష్మి గోల్డె న్ దేవాలయం దర్శనం చేసుకున్న అనంతరం బస్సు 20వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరు కుంటుందన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిణ దర్శనం అనంతరం 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయా ణంలో అలంపూర్ గద్వాల్‌లోని జోగులాంబ దేవస్థానం దర్శనం చేసుకుని 22వ తేదీ సాయంత్రం గోదావరిఖని చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో గోదావరిఖని నుంచి అరుణాచలంకు పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4,050, కరీంనగర్ నుంచి అరుణాలంకు పెద్దలకు 4,500, పిల్లలకు 3,800 ఛార్జీలు ఉంటాయన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సర్వీసు నెంబర్ 69999ను ఎంపిక చేసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 15: దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో దొంగలను అరెస్ట్ చూపిన అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పలు జిల్లాలోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్(30), వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారానికి చెందిన అల్లెపు పర్శరాం (21) అనే ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద 8 తులాల బంగారు అభరణాలు, 2తులాల వెండి అభరణాలు ఒక ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్స్, ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. ఈ ఇద్దరు దొంగలపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 కేసులు, జగిత్యాల జిల్లాలో 2కేసులు, కరీంనగర్ జిల్లాలో 2కేసులు , సిద్దిపేట జిల్లాలో ఒక కేసు నమోదైందని ఆయన తెలిపారు. హుస్నాబాద్ మండలంలోని అకుసాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్ వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో ఉంటూ బావుల పూడిక మట్టిపని చేసుకొని జీవిస్తున్న క్రమంలో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఆశతో దొంగతనాల వైపు దృష్టి పెట్టాడన్నారు. ఇతను ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో గల పెద్దమ్మగుడి తలుపులు పగుల గొట్టి అమ్మవారి బంగారు పుస్తెలు, వెండి మట్టెలు చోరీకి పాల్పడినట్లు , మరుసటి రోజునే ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ శివారులోని గొర్ల షెడ్డు నుంచి రెండు గొర్లను ఎత్తుకెళ్లాడన్నారు. ఆ తర్వాత వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంకు చెందిన పరుశరాంతో స్నేహం ఏర్పడి ఇద్దరు కలిసి దేవాలయాల్లో చోరీలకు పాల్పడాలడని నిర్ణయించుకున్నారన్నారు. చందుర్తి డ్యాం వద్ద గల దుర్గమ్మ ఆలయం, కొడిమ్యాల మండలంలోని తిప్పాయపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, బోయిన్‌పల్లి మండలంలోని జగ్గారావుపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలోని పెద్దమ్మ ఆలయం, టెక్స్‌టైల్ పార్క్‌లోని పెద్దమ్మ ఆలయం, ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం, బోయిన్‌పల్లి మండలంలోని మల్లాపూర్ వద్ద గల సీతారామ ఆంజనేయ స్వామి ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లిలో గల పెద్దమ్మ ఆలయం, ఒడ్యారం గుట్టపై గల రామాలయం, అల్లునూర్‌లోని ఎల్లమ్మ ఆలయం, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలోని ఎల్లమ్మఆలయం, కొడిమ్యాల మండలంలోని నల్లగొండ లక్ష్మినర్సింహస్వామి ఆలయాల్లో ఇద్దరు దొంగలు బంగారు, వెండి ఆభరణాలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్ బృందంతో ప్రత్యేక బృందంను ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టగా ఇద్దరు దొంగలను ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.


దొంగల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో దొంగల సంచారం?

● సీసీ కెమెరా ఫుటేజ్‌లో ఇద్దరు వ్యక్తుల కదలిక

జ్యోతినగర్, జూలై 15: ఎన్టీపీసీ ఉద్యోగులు నివాసం ఉండే పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో ఆదివారం రాత్రి దొంగల సంచారం కలకలం రేపింది. పీటీఎస్‌లోని చాచా నెహ్రూ పార్కు సమీపంలో ఉన్న సి - బ్లాకు క్వార్టర్ల ఏరియాలో ఇద్దరు ముసుగు వేసుకున్న అగంతకుల కదలికలను గుర్తించారు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు సంచరించినట్లు ఒక అధికారికి చెందిన ఇంటి సీసీ కెమెరాలో రికార్డయింది. అయితే ఆ ఇద్దరు దొంగలు ఎవరి ఇంట్లోనూ చోరీకి పాల్పడలేదు. సీసీ కెమెరా ఫుటేజీని ఎన్టీపీసీకి సంబంధించిన ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి అందించారు. ఫుటేజీని పరిశీలించిన సెక్యూరిటీ సిబ్బంది ఎన్టీపీసీ యాజమాన్యానికి సమాచారం అందించారు. సోమవారం ఎన్టీపీసీ ఎస్టేట్ అధికారులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముసుగు వేసుకొని, చేతిలో చోరీకి ఉపయోగించే పరికరాలతో తిరుగుతున్న దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వారి కదలికల ఆధారంగా అగంతకులు స్థానికులా? లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా? అని విచారిస్తున్నట్లు సమాచారం. ఏడాది క్రితం ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లోనే ఐదు ఇళ్లలో చోరీ జరిగింది. ఇప్పటి వరకు ఆ చోరీకి సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించలేదు. మరోసారి దొంగల సంచారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది.



ఎన్టీపీసీ పీటీఎస్‌లో సంచరిస్తున్న ఇద్దరు దొంగలు

హత్యాయత్నం కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: కుటుంబ కలహాలతో భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో భర్త ఇస్లావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని దేవునిగుట్ట తండాకు చెందిన విజయకు పదేళ్ల క్రితం కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన ఇస్లావత్ రమేష్‌తో వివాహమైంది. అదనపు కట్నం కోసం రమేష్ విజయను వేధింపులకు గురిచేయడంతో ఆరేళ్ల క్రితం కేసు నమోదైంది. ఇకనుంచి భార్యను బాగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో అంగీకరించి విజయను ఇంటికి తీసుకెళ్లాడు. అతనిలో మార్పు రాకపోవడంతో వా రం రోజుల క్రితం విజయ గొల్లపల్లిలో గది అద్దెకు తీసు కుని పిల్లలతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 రాత్రి విజ య నివసిస్తున్న ఇంటి వద్దకు చేరుకున్న రమేష్ ఆమెతో గొడవ పడ్డాడు. ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని తలపై దాడి చేయడంతో విజయకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

24లోగా పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, జూలై 15: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఎంఎస్‌డబ్ల్యూ, ఎంటీఏ, ఎంసీఏ రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి 24వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నారు.

వర్షం కోసం శివుడికి జలాభిషేకం


గోదావరి నది నుంచి బిందెలతో జలం తీసుకవస్తున్న ఆర్యవైశ్యులు

ధర్మపురి, జూలై 15: వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి జలాభిషేకం నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్యులు స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి మేళ తాళాలతో గోదారవరి వరకు వెళ్లారు. అనంతరం గోదావరి మాతకు ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన ఆర్య వైశ్యులు బిందెలతో జలాలను తీసుకొచ్చి శివుడిపై పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ శాఖ అధ్యక్షులు మురికి శ్రీనివాస్, పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడు అక్కెనపెల్లి రాజేందర్, జిల్లా నాయకులు జక్కు రవీందర్, ఆర్యవైశ్య, నిత్యాన్న సత్ర సంఘాల కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ అధ్యక్షురాలు గందె పద్మ పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని

వాటర్‌ట్యాంక్ ఎక్కిరైతు నిరసన


పురుగుల మందు డబ్బాతో ట్యాంకుపై రైతు


రైతు రాజేందర్

కాల్వశ్రీరాంపూర్, జూలై 15: పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి ఇవ్వాలని ఓ రైతు పురుగుల మందు డబ్బాతో వాటర్‌ట్యాంక్ ఎక్కిన సంఘటన మండలంలోని గంగారంలో జరిగింది. సంఘటన స్థలానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఆ గ్రామానికి చెందిన రైతులు, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డితో పాటు గ్రామస్థులు వాటర్ ట్యాంకు వద్దకు వచ్చారు. సుమారు మూడు గంటల వరకు పురుగుల మందు డబ్బాతో రాజేందర్ వాటర్ ట్యాంక్ పైనే ఉండడంతో గ్రామస్థులు, రాజేందర్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రాజేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి దారి కోసం హామీ ఇవ్వడంతో పాటు తహసీల్దార్ జాహేద్ పాషా సంబంధిత ఇరిగేషన్ అధికారులను కాల్వపై భూమి కబ్జా అయిన స్థలం వద్దకు తీసుకు వస్తానని మాట ఇవ్వడంతో అంబాల రాజేందర్ వాటర్ ట్యాంక్ దిగాడు. దీంతో రాజేందర్ కుటుంబ సభ్యులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా రైతు అంబాల రాజేందర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలనుంచి గ్రామానికి చెందిన యాట ఓదెలు తన వ్యవసాయ భూమి పక్కనున్న దారి నాదేనంటూ దున్ని, రైతులను ఆ బాట నుంచి వెళ్లకుండా చేశాడని పేర్కొన్నారు. దీంతో మూడు సంవత్సరాలుగా సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందన్నారు. ఎమ్మెల్యే, తహసీల్దార్ హామీతో వాటర్ ట్యాంక్ దిగినట్టు రాజేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 15: మహారాష్ట్రలోని కొల్లాపూర్ జిల్లా పట్గావ్ గ్రామానికి చెందిన వలస కూలీ సంజయ్‌పూరీ (45) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని సిరిసిల్ల - కామా రెడ్డి రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్ జిల్లా పట్గావ్ గ్రామనికి చెందిన వలసకూలీ సంజయ్‌పూరీ తన భార్య, సుమారు30 మంది సమీప బంధువులతో 12 రోజుల కిందట గొల్లపల్లి గ్రామానికి వలస వచ్చాడు. గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద ఓ గదిలో ఉంటూ వరి నాట్లు వేస్తున్నారు. సంజయ్ పూరీ రోడ్డు పక్క నుంచి వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. అక్కడే ఉన్న తోటి కూలీలు అతన్ని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. తోటి కూలీలు సంజయ్ పూరీకి వైద్యం అందించేందుకు స్వగ్రామానికి తరలిస్తుండగా మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

తంగళ్లపల్లి, జూలై 15: పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్న రైతును ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు శంకరయ్య (58) సోమవారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గండిలచ్చపేట స్టేజీ మూలమలుపు వద్ద నాగళ్లతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగానే మృతిచెందాడు. మృతునికి భార్య దేవవ్వ, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓదెల మల్లన్న క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

● కన్నుల పండువగా అగ్నిగుండం, పెద్దపట్నం

ఓదెల, జూలై 15: వేదపండితుల మంత్రోచ్చరణ, ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలతో శైవక్షేత్రం పంచాక్షరి మంత్రంతో విలసిల్లింది. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన బ్రమరాంభ మల్లిఖార్జునస్వామి క్షేత్రంలో ఆది, సోమవారాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. పెద్దపట్నం, అగ్ని గుండం మహోత్సవాలు , అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయంలో ఒగ్గుపూజారులు పెద్దపట్నం వేసి మల్లిఖార్జునస్వామి జీవిత చరిత్రను కథ రూపంలో వివరించారు. సోమవారం అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు ఆలయంలో వేదపండితులు అర్చకులు, నిత్యోత్సవం , గణపతి పూజ, శివ పుణ్యాహవాచనం, శివ యాగ మండప స్థాపన , భద్రకాళి అవహనం , దక్షయాగం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ ధర్మకర్తలు, ఈవో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మేకల మల్లేషం , సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి , కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ ఓంకార్ యాదవ్ , మంథని ఎస్ఐ వెంకట కృష్ణ , ధర్మకర్తలు కనికిరెడ్డి సతీష్, చింతం వెంకటస్వామి, కర్రె కుమార్, చింతం మొగిలి, బత్తుల రమేష్, మ్యాడగోని శ్రీకాంత్, దాసరి రాజన్న, ఆరెల్లి మొండయ్య, మూడెత్తుల శ్రీనివాస్ ఉన్నారు.


బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే విజయరమణరావు

ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్‌పై డీఈ విచారణ

● తరచూ కాలిపోతుండటంపై ఆరా
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి విద్యుత్ అధికారుల స్పందన

గంగాధర, జూలై 15: ట్రాన్స్‌ఫార్మర్లు తరచుగా ఎందుకు కాలిపోతున్నాయని కరీంగన్ విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ విజేందర్‌రెడ్డి మండల విద్యుత్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన గంగాధర మండలం వెంకంపల్లిలోని ఎస్ఎస్226, బూరగుపల్లి ఎస్ఎస్6, ర్యాలపల్లిలో ఎస్ఎస్1, నాగిరెడ్డిపూర్‌లోని ఎస్ఎస్99 ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు గ్రామాల్లో ఎన్ని ఫెయిల్ అయ్యాయి, తరచుగా ఎందుకు జరుగుతోందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పుడు మారుస్తున్నారనే వివరాలు సేకరించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈడీఏ సత్యనారాయణరెడ్డి, ఏఈ తిరుపతి, సవాయ్‌నాయక్, సబ్ ఇంజనీర్ మోహన్, లైన్‌మెన్లు ఉన్నారు.


వెంకంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈ

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి శిక్ష

కోల్‌సిటీ, జూలై 15: మద్యం తాగి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన కొత్తకొండ శంకర్ అనే వ్యక్తికి గోదావరిఖని రెండో అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి గురువ వెంకటేష్ సోమవారం మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిన 27మందికి రూ.58వేల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి

గంగాధర, జూలై15: గంగాధర మండలం గర్శకుర్తిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇన్ చార్జి ఎస్ఐ సురేందర్ వివరాల ప్రకారం.. గర్శకుర్తి గ్రామానికి చెందిన చిందం మాధురి(23) సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. మాధురి తల్లి తన పెద్ద కూతురు ఇంటికి వెళ్లగా ఇంట్లో ఒక్కతే ఉంది. సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే పీజీ చదువుతున్న మాధవి చనిపోయేంత పిరికిది కాదని, ఆమె మృతిపై అనుమానం ఉందని మృతురాలి మేనమామ సిరిమల్ల రాజేశ్ పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 15: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తేవీరీల దర్గా మూలమలుపు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని గుండారం గ్రామానికి చెందిన వ్యక్తి జజ్జరి దేవరాజుకు తీవ్ర గాయాలపాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవరాజు తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి గుండారంకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు అతి వేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

వేములవాడ టౌన్, జూలై 15 : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కోనాయపల్లి గ్రామానికి చెందిన బావుపేట రామస్వామి అనే గీత కార్మికుడు తన వృత్తిలో భాగంగా సోమవారం తాటి చెట్టుపై నుంచి కల్లు తీసేందుకు చెట్టుపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారీపడటంతో కాలు విరిగి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు ... తప్పిన ప్రమాదం

వేములవాడ టౌన్, జూలై 15 : ఆర్టీసీ బస్సును కారు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి వేములవాడకు వస్తుండగా, కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు కారు వెళుతుంది. ఈ క్రమంలో ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు సడెన్‌గా నిలిపివేయడంతో వెనుకనుంచి స్పీడ్‌గా వస్తున్న కారు బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు ముందటి బాగం పూర్తిగా ధ్వంసం కాగా కారులో వున్న డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 15 : కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ ప్లాట్‌ఫాం(16) వద్ద స్పృహకోల్పోయిన గుర్తుతెలియని వృద్ధురాలు(కమల) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 6:30 గంటల సమయంలో బస్టాండ్‌లో స్పృహ కోల్పోయిన వృద్ధురాలును 108 సిబ్బంది కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా తన పేరు కమలగా పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి మరణించినట్లు వెల్లడించారన్నారు. వృద్ధురాలు బస్టాండ్ పరిసరాలలో భిక్షాటన చేసి రాత్రి సమయంలో బస్టాండ్‌లో నిదిస్తుందని స్థానికుల ద్వారా వెల్లడైందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతురాలిని గుర్తించినవారు కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ 8712670761, 9908440822కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఎస్సారెస్పీలోకి పెరుగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,831 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. సోమవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,831 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.078 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 19.850 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.381 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

ఇల్లందకుంట, జూలై 15: టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రవీందర్‌పై ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లో సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఓ యువతిని సెల్‌ఫోన్‌లో వేధించగా, యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

వృద్ధుడి మృతి

శంకరపట్నం, జూలై 15: మండలంలోని కన్నాపూర్‌లో కారు ఢీకొని చికిత్స పొందుతూ మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నక్క గట్టయ్య (72) అనే మతిస్థిమితం సరిగాలేని వృద్ధుడిని ఇటీవల కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొట్టింది. చికిత్స చేయించి ఆస్పత్రి నుంచి రెండురోజుల క్రితం ఇంటికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించి సోమవారం ఇంటి వద్ద మృతి చెందాడు.


కొలిమికుంట వద్ద రహదారిపై గుంతలు


చొప్పదండి వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

గుంతలున్నాయ్.. జాగ్రత్త

● ప్రమాదకరంగా రాయపట్నం రహదారి ● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
● మరమ్మతులు చేపట్టని అధికారులు

చొప్పదండి,జూలై15:ఆరు జిల్లాలకు వారదిగా నిలుస్తున్న రాయపట్నం రహదారిని పట్టించుకునే వారు కరువయ్యారు.ప్రతినిత్యం వందలాది వహనాలు,వేలాది మంది ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.చొప్పదండి మండల పరిదిలో రహదారి 15కిలోమీటర్ల దూరం ఉండగా పలు చోట్ల గుంతలు పడగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.రెండేళ్ళ క్రితం రహదారికి మరమత్తులు చేపట్టగా చిన్న వర్షానికే పలు చోట్ల గుంతలు పడ్డాయి.చొప్పదండి లోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్డు వద్ద మరమత్తులు చేపట్టకపోవడంతో దాదాపు అర కిలోమీటర్ మేరకు రహదారి ద్వంసం అయ్యింది.ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.రుక్మాపూర్,కొలిమికుంట శివార్లలో పలు చొట్ల గుంతలు పడగా ఇప్పటికైనా అదికారులు స్పందించి రహధారికి మరమత్తులు చేపట్టాలాని ప్రజలు కొరుతున్నారు.


రుక్మాపూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

'అల్ఫోర్స్'లో ఘనంగా బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 15: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఆషాడమాసం సందర్భంగా బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగకు విశిష్టత ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి మాతకు బోనం సమర్పించి బోనాల ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన అంబాభవాని బంగారు బోనం, బాల్కంపేట ఎల్లమ్మజాతర వంటి నృత్యాలు పలువురిని ఆకర్శించాయి. యాభై మంది విద్యార్థులు పోతరాజుల వేష ధారణలో విన్యాసాలు ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

రచయిత్రి తోట నిర్మలారాణికి పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జూలై 15: కరీంనగర్‌కు చెందిన రచయిత్రి తోట నిర్మలారాణికి తెలంగాణ సారస్వత పరిషత్ రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని సోమవారం హైదరాబాద్ బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ దేవులపల్లి రామానుజరావు హాల్లో ప్రదానం చేశారు. సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని స్వీకరించారు. పరిషత్తు ఈ ఏడాది ఉత్తమ గ్రంథాలకు ప్రకటించిన పురస్కారాల్లో తోట నిర్మలారాణికి 'అద్దం నా చిరునామా కాదు' కవితా సంపుటి వచన కవితా విభాగంలో ఎంపికైనందుకు ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ నుంచి తెరవే అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, పుప్పాల శ్రీరాం, విలాసాగరం రవీందర్ పెనుగొండ బసవేశ్వర్, పెనుగొండ సరసిజ, రామానుజం సుజాత, మహేందర్ పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 15: పిల్లల కోసం గేమ్ ఛేంజర్‌గా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉపయోగపడుతాయని నేషనల్ ఇన్నోవేషన్ పాలసీ మేకర్, యూనిసెడ్ చైర్మన్, చీఫ్ మెంటార్ అవనీష్ త్రిపాఠి అన్నారు. సోమవారం నగరంలోని దన్గర్‌వాడి పాఠశాలలో యూనిసెడ్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ లాబ్స్ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లు, అటల్ కమ్యునిటి ఇన్నోవేషన్ సెంటర్‌లు స్టార్టప్‌లు, ఇన్నోవేటర్‌లకు మద్దతు ఇవ్వడంతో పాఠశాల పిల్లలో వినూత్న ఆలోచనలను పెంపొందిస్తాయన్నారు. ఆత్మ నిర్బర్ భారత్ భారతదేశ వైజ్ఞానిక నైపుణ్యం ప్రధానపాత్ర పోషించబోతుందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఓఎన్‌జిసి లిమిటెడ్ సాయంతో కరీంనగర్‌లో 25 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను తీసుకురావడానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెడ్ మానిటర్ డైరెక్టర్ గిరిజశంకర్, డైట్ సూపరింటెండెంట్ భగవాన్‌రెడ్డి, సిరిసిల్ల జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శైలజ, కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ తొత్తి శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ వికాస్, అభిషేక్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై కాంగ్రెస్ సంబరాలు

గణేశ్‌నగర్, జూలై 15 : రాష్ట్రంలో రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్‌లో సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిరాచౌక్‌లో మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. సిరాజ్ హుస్సేన్, నాయకులు పడిశెట్టి భూమయ్య, సర్దార్ దన్నా సింగ్, వీర దేవేందర్ పటేల్, చింతల కిషన్, శ్రీకాంత్, కటకం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టేడియంలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

సుభాష్‌నగర్, జూలై 15: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగే అక్రమాలపై విచారణ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె బద్రీనేత, విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ సూర్యకిరణ్ ఉన్నారు.

ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం

హుజూరాబాద్, జూలై 15: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం హుజూరాబాద్ ఇన్‌చార్జి బీకే కల్పన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. అనంతరం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ప్రాబ్లమ్ సొల్యూషన్ స్కిల్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ రిలేషన్స్ టీమ్ వర్క్ గురించి వివరించారు. కార్యక్రమంలో వాణి, రాజయ్య, ఈశ్వరయ్య, సుగుణ, వాసుదేవరావు, తులసిదాస్, జనార్ధన్, పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, జూలై 15: హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు బహిర్గతం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో కాంగ్రెస్ నాయకులు శ్రావణ్, నాగరాజులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరాబాద్ పట్టణంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో అధికంగా డబ్బులు వసూలు చేస్తూ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శంకరపట్నం, జూలై 15: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని మొలంగూర్ గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం అపరిచితులతో పంచుకోవద్దన్నారు. మొబైల్‌లో అనవసర లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. యువత సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిని మంత్రికి వివరించాం



సమావేశంలో మాట్లాడుతున్న పొనగంటి మల్లయ్య

జమ్మికుంట, జూలై 15: జమ్మికుంట మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌తో కలిసి హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించామని కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య తెలిపారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని తన నివాసంలో పలువురు కౌన్సిల్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో చేయని పనులకు బిల్లులు తీసుకున్నారని, కొన్ని పనులకు ముందస్తు బిల్లుల చెల్లింపులు జరిగాయని, మరికొన్ని పనులకు అత్యధిక డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. స్పందించిన మంత్రి అవినీతి, అక్రమాలపై విచారణ చేపడుతామని చెప్పారన్నారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిలో ఇళ్లు నిర్మించి నెంబర్లు కూడా తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు సాయిని రవి, బొంగోని వీరన్న, రావికంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలను కప్పి పుచ్చేందుకు మేయర్ యత్నం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 15 : స్మార్ట్‌సిటీ పనుల్లో అక్రమాలను కప్పి పుచ్చేందుకే మేయర్ సునీల్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో ములాఖత్ అయ్యారని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆరోపించారు. డీసీసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులను సునీల్‌రావు దండుకున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లే ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. 20 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న సునీల్‌రావుకు ప్రొటోకాల్ తెలియకపోవటం విడ్డూరంగా ఉన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా సన్మానించడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబులను ఎందుకు సన్మానించలేదని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపల్ సమీక్ష జరిపితే రాద్ధాంతం చేస్తున్న మేయర్‌కు మంత్రిని విమర్శించే హక్కు లేదన్నారు. అవినీతిపరుడైన మేయర్, వారిని సమర్ధించే బండి సంజయ్ ఇద్దరిదీ అక్రమ కలయిక అని పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ యాడగొండ బుచ్చిరెడ్డి, గంట కళ్యాణి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కాశెట్టి శ్రీనివాస్, ఆకుల ప్రకాశ్, పరిశ్ల ప్రసాద్, పడిశెట్టి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

●విజిలెన్స్ విచారణను తప్పించుకునేందుకే మేయర్ సునీల్‌రావు పథకం వేసి కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిశారని కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పలుమార్లు దూషించారని, మున్సిపల్ అభివృద్ధి కోసం ఒక రూపాయి కేంద్ర నిధులు తీసుకురాలేదని విమర్శలు చేశారన్నారు. పాలకవర్గ సభ్యులతో మేయర్ సునీల్‌రావు కేంద్ర మంత్రిని కలవడంతో బీఆర్ఎస్, బీజేపీ అనైతిక పొత్తు బహిర్గతమైందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కాశెట్టి శ్రీనివాస్, సరిల్ల ప్రసాద్, మెండి మార్షల్, ఆకుల ప్రకాష్, వైద్యుల అంజన్ కుమార్, పడిశెట్టి భూమయ్య, పిట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: మేయర్ సునీల్‌రావు బీజేపీకి అమ్ముడుపోయి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేస్తున్నాడని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపాలిటీపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మేయర్‌గా ఇంతవరకు మర్యాదపూర్వకంగా కలవలేదన్నారు. కానీ ఇటీవల కేంద్ర సహాయ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను సన్మానించాడని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌కు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి సునీల్‌రావు అని ఆరోపించారు. కరీంనగర్ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సునీల్‌రావుకు కాంగ్రెస్ పార్టీ జన్మనిచ్చిందన్నారు. మార్కెట్ కమిటి చైర్మన్‌ను చేసిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఏడు నెలల్లో సంక్షేమ పాలనతో ప్రజలకు చేరువయ్యారని అన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి

సుభాష్‌నగర్, జూలై 15: చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అమ్మమాట-అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చిన్నపిల్లలను లక్షల రూపాయల ఫీజులు కట్టి ప్లే స్కూళ్లల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో ప్లేస్కూలు మాదిరిగి పిల్లలను ఆటలు ఆడిస్తూ, బొమ్మల ద్వారా వారికి ఇష్టమైన పద్ధతిలో జ్ఞానాన్ని పెంచే విధంగా అంగన్‌వాడీ సెంటర్లు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సీడీపీవో జి ఉమారాణి, కిసాన్‌నగర్ సెక్టర్ సూపర్‌వైజర్ ఎన్.రాజేశ్వరి, అంగన్ వాడి సెంటర్ టీచర్లు టి పద్మజ, జి సుజాత, ఆయాలు ఏఎన్ఎం మానస ఆశా వర్కర్లు జానకి కవిత, ఆర్‌పి రజిత పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: మండలంలో పలు గ్రామాల్లో అమ్మమాట, అంగన్ వాడీ బాట కార్యక్రమంలో బాగంగా సోమవారం ర్యాలీలు నిర్వహించారు. జూబ్లీనగర్ గ్రామంలో విద్యార్థులతో ప్లకార్లును ప్రదర్శిస్తు ర్యాలీలను నిర్వహించగా ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కిరణ్ రావు, ప్రధానోపాధ్యాయురాలు జలజారాణి, సూపర్ వైజర్ నిర్మల, ఎఎన్ఎమ్ సుగుణ, అంగన్ వాడీ టీచర్లు స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

●దుర్శేడ్ గ్రామంలో అంగన్ వాడి కేంద్ర పరిధిలో అమ్మబాట-అంగన్‌వాడీ బాటను పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్ వడీలో పిల్లను నమోదు చేయాలని, వారి భవితకు పునాది వేయండంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జానకి దేవి, సీఏ టి విజయలక్ష్మీ, అంగన్ వాడీ టీచర్లు బి పద్మశ్రీ, ఈ రాజేశ్వరి, ఆశవర్కర్‌లు జీ లక్ష్మీ, కె సరోజ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

భగత్‌నగర్, జూలై 15: కొత్తపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఎలగందల్‌లోని మాడల్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారని, బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 15: ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా వైస్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌లు అధికారులను ఆదేశించారు. కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) కార్యాలయంలో సోమవారం వారు సిబ్బంది, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సుడా పరిధిలోని అక్రమ లేఅవుట్‌ల విషయంలో ఉదాసీనత పనికిరాదని అధికారులకు సూచించారు. సుడాకు రెవెన్యూ పెంచాలని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసమీక్షా సమావేశానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సుడా అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినూత్న నిరసన



మద్యం సీసాలు, డబ్బులు, విస్తరిలో పేడతో నిరసన తెలుపుతున్న దుర్గం మనోహర్

సుభాష్‌నగర్, జూలై 15: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని కాపాడాలని రెవెన్యూ అధికారులను కోరితే తన పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆరోపిస్తూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన దుర్గం మనోహర్ అనే వ్యక్తి సోమవారం వినూత్న నిరసన తెలిపాడు. కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్నంగా కూర్చుని ఖాళీ మద్యం సీసాలు, డబ్బులు, విస్తరిలో పేడ పెట్టి నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కాపాడాలని 2018 నుంచి ఇప్పటి వరకు చాలాసార్లు ఫిర్యాదు చేశానని తెలిపాడు. తహసీల్దార్, ఆర్డీవో ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. తన తండ్రి పేరుతో కొత్తపల్లి మండల శివారులోని 432 సర్వేలోని 21 గుంటల భూమి ఉందని, దానిని తన తల్లి ద్వారా తనకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అన్ని రకాల ఫీజులు చెల్లించానని తెలిపారు. తహసీల్దార్, ఆర్డీవో తన భూమి రిజిస్ట్రేషన్‌ను ఆపుతున్నారని అన్నారు. ఇదే విషయమై ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. అధికారులపై ఫిర్యాదు చేస్తావా అని ఆర్డీవో ఇబ్బం దులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని దుర్గం మనోహర్ కోరారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే



గుండ్లపల్లిలోని గురుకుల పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

గన్నేరువరం, జూలై 15: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న మహత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో నిలిచిన మురికి నీరు, అపరిశుభ్రత వాతావరణాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పడుకోవడానికి బల్లలు లేక పోవడమే కాకుండా మురికి నీటితో దుర్వాసన ఈగలు, దోమలతో అనారోగ్యపాలవుతున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారికి ఫోను చేసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పది రోజులలో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

గురుకుల పాఠశాల కోసం భవనం పరిశీలన

మానకొండూర్: మహత్మజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాల నిర్వహణ కోసం మానకొండూర్‌లోని ఓ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. భవనంలోని గదులు, క్రీడామైదానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గన్నేరువరంలోని గుండ్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న మహత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఇరుకుగదులు, అపరిశుభ్రత వాతావరణంలో కొనసాగుతుందని తెలిపారు. అక్కడి నుంచి ఇక్కడికి తరలించి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. డిసిసి ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్, జడల రమేశ్ తదితరులు ఉన్నారు.

బెటర్ కాటన్ సమావేశానికి హాజరైన జమ్మికుంట వాసి

జమ్మికుంట రూరల్, జూలై 14: టర్కీ దేశంలోని ఇస్తాంబుల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ బెటర్ కాటన్ సమావేశానికి కరీంనగర్, వరంగల్ బీసీఐ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న జమ్మికుంట పట్టణ వాసి మ్యాడగోని మల్లేష్ హాజరయ్యారు.

27దేశాలకు సంబంధించిన ప్రముఖులు హాజరైన ఈ సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీఐ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను చెప్పారు. పునరుత్పాదక వ్యవసాయంలో ఉన్న అంశాలు, భూసారాన్ని పెంచుకోవడంపై మాట్లాడారు.

ఇసుక క్వారీపై చర్యలు తీసుకోవాలి

తిమ్మాపూర్, జూలై 15: మండలంలోని కొత్తపల్లి-రేణికుంట గ్రామాల మధ్య గల మోయతుమ్మెద వాగులో అనుమతి ముగిసినా ఇంకా ఇసుక క్వారీ యజమానులు , అధికారుల అండతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని సోమవారం ప్రజావాణిలో రేణికుంట గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, రైతులు వంశీ, జూపాక వెంకటేష్, తమ్మనవేని శ్రీనివాస్ యాదవ్, పండుగ సురేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తిమ్మాపూర్, జూలై 15: స్థానిక ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ సమీపంలో రాజీవ్ రహదారిపై సోమవారం ఎల్ఎండీ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు ఆధ్వర్యంలో సాయంత్రం రెండు గంటల పాటు వాహనాలను తనిఖీ చేశారు.

పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి ఆర్థిక సాయం

సైదాపూర్, జూలై 15: వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలై చికిత్స పొంది, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఏ పార్టీ వారైనా పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నదని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం సైదాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో కాంగ్రెస్ నాయకులతో కలిసి రూ. 6,78,000ల విలువ చేసే 35 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గ్రామ గ్రామం తిరుగుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊసకోయిల రాఘవులు, పోగు రమేష్, రాజేందర్‌రెడ్డి, లంకదాసరి మల్లయ్య, శేకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలతో ర్యాలీ

సైదాపూర్, జూలై 15: 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమంలో భాగంగా సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి అంగన్ వాడీ కేంద్రంలోని పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. మూడు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీకి తప్పని సరిగా పంపించాలని నినాదించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 20 వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, అంగన్‌వాడీ టీచరు స్వరూప, జ్యోతి, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

● గంగాధర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీవో కస్తూరి అన్నారు. సోమవారం గంగాధర మండల మల్లాపూర్‌లో అమ్మ మాట,అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి పెద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మట్లాడుతూ ఆట పాటల ఒడి అంగన్‌వాడీ కేందాలకు చిన్నారులను పంపించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చొప్పదండి: చొప్పదండిలో అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి,రేణుక,సాయికృష్ణ,సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరి ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై15: కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గ భవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరీ ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని చామగడ్డల మాలలతో అలంకరించారు. ఈపూజల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, కార్పొరేటర్ వంగల శ్రీదేవి పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: వాసవి వృద్ధాశ్రమంలోని వాసవి మాత ఆలయంలో అమ్మవారికి సోమవారం శాకంబరీ అలంకారం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టుమల్ల కొండయ్య-స్వర్ణలత దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన కేంద్ర మంత్రి

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 15: హైదరాబాద్‌లోని హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 12,13 తేదీల్లో నిర్వహించిన రీజినల్ స్కేటింగ్ పోటీల్లో కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న తాటి విశ్రుత్ 3 వివిధ అంశాల్లో 1 బంగారు, 2 రజిత పతకాలు సాధించాడు. సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అభినందించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫోన్‌లో అభినందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ వామనరావు, పీఈటీ ప్రియాంక, వివేక్, మృణాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ సభ్యులను అభినందించిన మంత్రి

కరీంనగర్ అర్బన్, జూలై 15 : ఇటీవల కొత్తగా ఏర్పాటైన కరీంనగర్ అర్బన్ డ్యాంక్ పర్సన్ ఇంచార్జి కమిటీ సభ్యులను సోమవారం రాష్ట్ర రావాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. అర్బన్ బ్యాక్ సభ్యులు గడ్డం విలాస్‌రెడ్డి, మడుపు మోహన్, తదితర 11 మంది సభ్యులను శాలువాలతో సత్కరించి, అభినందించారు.

చెరువు మత్తడికి మరమ్మతులు చేపట్టాలి

భగత్‌నగర్, జూలై 15: కొత్తపల్లి పెద్ద చెరువు మత్తడికి పడ్డ బుంగకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జమీలుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం రైతులు, నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కె వెంకటరెడ్డి, కొత్త రాజయ్య బీరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం

కరీంనగర్ క్రైం, జూలై 15: కరీంనగర్ పోలీసుశాఖలో హోంగార్డు విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహేందర్ దాదాపు 30 సంవత్సరాలు సేవలందించి సోమవారం పదవి విరమణ పొందారు. కమిషనరేట్ కేంద్రంలో కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ చేతుల మీదుగా పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) ఎం సురేష్, హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రజకవృత్తికి చట్టబద్ధత కల్పించాలి

కరీంనగర్ రూరల్, జూలై15: రజక వృత్తికి చట్ట బద్ధత కల్పించాలని రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ మండలం వల్లంపహాడ్ గ్రామంలో రజక వృత్తిని అగ్రవర్ణ కులస్తులు చేయవద్దని, ఆ డ్రైక్లినింగ్ షాపు ముందు రజకుల నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరి పూసాల శ్రీకాంత్, డ్రైక్లినింగ్ షాపుల అసోసియేషన్స్ అధ్యక్ష కార్యదర్శులు బూత్కూరి శివ, సాయిరాం, శంకర్, ఇలుగునూరి సంపత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెజీషియన్ మల్లేశంకు అరుదైన గౌరవం

కరీంనగర్ కల్చరల్, జూలై 15: స్థానిక ఇంద్రజాలికుడు ఎస్ మల్లేశంకు ఆంధ్రప్రదేశ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం గుంటూరులోని బృందావన్ గార్డెన్‌లో ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అమరావతి మేజిక్ ఫెస్టివల్‌లో జూనియర్, సీనియర్ మెజీషియన్లకు నిర్వహించిన పోటీల్లో మల్లేశం న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

బీమా చెక్కు అందజేత

కరీంనగర్ టౌన్, జూలై 15: ది గాయత్రీ కో ఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారుడైన పంజాల రాజేశం ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఆయనకు గాయత్రీ నిర్భయ సేవింగ్ ఖాతాకు సంబంధించిన లక్ష రూపాయల చెక్కును ఆయన కుమారుడు పంజాల అజయ్‌కి అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ జె.అశోక్ పాల్గొన్నారు.

జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

హుజూరాబాద్, జూలై 15: హుజూరాబాద్ పట్టణంలో ప్రముఖ సామాజిక కార్యకర్త కాశెట్టి కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం పలువురు ఘనంగా నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి ట్రీగార్డ్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

జమ్మికుంట రూరల్, జూలై 15: సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు యం నరహరి ఆధ్వర్యంలో పట్టణంలో అవయవదానంపై అవగాహన కల్పించారు. పట్టణానికి చెందిన చిదురాల వెంకటయ్య నేత్రాలు దానం చేయగా సంస్మరణ సభలో సోమవారం అవయవదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం చేసిన వెంకటయ్య కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

కాటమయ్య రక్షణ పథకం తీసుకురావడం అభినందనీయం

ఇల్లందకుంట, జూలై 15: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కాటమయ్య రక్షణ పథకం తీసుకురావడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు కాటమయ్య రక్షణ పథకాన్ని తీసుకువచ్చారన్నారు.

పోచంపల్లిలో ఇసుక డంప్ పట్టివేత

మానకొండూర్, జూలై 15 : మండలంలోని పోచంపల్లి గ్రామంలో సోమవారం మైనింగ్, రెవెన్యూ అధికారులు ఇసుక డంపును పట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన జోగిరెడ్డి అనే వ్యక్తి గ్రామంలో సుమారు 70 ఇసుక ట్రాక్టర్ల డంపు ఉందన్న గ్రామస్థుల సమాచారం మేరకు సంబంధిత అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అధికారి సారంగపాణి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్‌రూరల్, జూలై 15: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శీరిష మావయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మ న్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

'రాజీలేని పోరాటాలు'

రామడుగు, జూలై 15: పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంక టస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో మాట్లాడారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు.